ఢిల్లీ పరిణామాలపై పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు వి.శ్రీనివాసరావు ప్రకటన ప్రచురణార్థం పంపుతున్నాము.

– జె.ప్రభాకర్, ఆఫీసు కార్యదర్శి

విజయవాడ,

ప్రచురణార్థం/ ప్రసారార్థం : తేది : 04 మార్చి, 2020.

## బి.సి.రిజర్వేషన్లపై సుప్రీం కోర్టుకు అప్పీలు చేయాలి.

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఒబిసి రిజర్వేషన్లను 25 శాతానికి కుదిస్తూ, హైకోర్టు ఇచ్చిన తీర్పు దురదృష్టకరం. గత స్థానిక ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లు అమలయ్యాయి. ఇప్పుడు ఈ ఎన్నికల్లో బిసిలు ఆ హక్కును కోల్పోవడం బాధాకరం. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం, ఇటు ప్రధాన ప్రతిపక్షపార్టీ టిడిపి అనుసరిస్తోన్న వైఖర్లలో చిత్తశుద్ధి లేదు. ప్రభుత్వం 34 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని జిఒ ఇచ్చి, కోర్టు తీర్పుపై హర్షం వ్యక్తం చేస్తూ చేతులు ముడుచుకుని కూర్చుంది. టిడిపిపై అధికారపార్టీ నెపం వేస్తే, వారు వైసిపిపై నిందలు వేస్తూ పరస్పరం విమర్శించుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఈ విషయంలో చిత్తశుద్ధి ఉంటే, హైకోర్టు తీర్పుపై సుప్రీం కోర్టులో అప్పీల్ వేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి సిపిఐ(యం) విజ్ఞప్తి చేస్తున్నది. సిపిఐ(యం) కేంద్ర కమిటీ సభ్యుడు వి.శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడుతూ ఇప్పటికే బిసిలు అనుభవిస్తున్న రిజర్వేషన్ల హక్కులను కాపాడాలని కోరారు.

రాష్ట్రంలో ఎన్‌పిఆర్ ప్రస్తుత రూపంలో కాకుండా 2010 ప్రశ్నల ఆధారంగా అమలు చేయాలని కోరుతూ రాష్ట్ర కేబినెట్ నిర్ణయించింది. కేంద్రం నుంచి స్పష్టత వచ్చేవరకూ దీనిని అమలు చేయబోమని ప్రకటించడం హర్షణీయం. అయితే, ఏప్రిల్ 1 నుంచి జనాభా లెక్కలు ప్రారంభం కానున్న దృష్ట్యా ఎన్‌పిఆర్‌ను నిలుపుదల చేసి, జనాభా లెక్కలకే పరిమితం కావాలని కోరుతున్నాం. దీంతోపాటు సిఎఎ, ఎన్ఆర్‌సి ప్రమాదం మెడమీద కత్తిలా వేలాడుతునే ఉంది. కాబట్టి దీనిని వ్యతిరేకిస్తూ, అసెంబ్లీలో తీర్మానం చేసి, కేంద్రానికి పంపాలి. పౌరసత్వ సమస్యపై ఇప్పటివరకూ టిడిపి నోరుమెదపకుండా ఉండటం అన్యాయం. బాధ్యత కలిగిన ప్రతిపక్ష పార్టీగా దీనిపై తన వైఖరిని వెల్లడించడమే కాకుండా అసెంబ్లీలో తీర్మానం పెట్టేందుకు ముందుకు రావాలి.

ఢిల్లీలో అల్లర్ల తర్వాత అక్కడి పరిస్థితి అభద్రతాభావంతో, అశాంతితో ఉంది. గత రెండు మూడు రోజులుగా అక్కడే ఉన్నాను. ఢిల్లీ పౌరుల్లో భయకంపిత వాతావరణం కనిపిస్తోంది. ఓ పథకం ప్రకారం భయటనుంచి వచ్చిన సాయుధ గూండాలు దాడులకు పాల్పడ్డారని చెబుతున్నారు. కేంద్ర హోంశాఖ, పోలీసులు చేష్టలుడిగి వ్యవహరించారు. మతాలకు అతీతంగా సాగుతోన్న పౌరసత్వ వ్యతిరేక ఉద్యమాన్ని విచ్ఛిన్నం చేయడానికి కేంద్ర ప్రభుత్వం పన్నాగం పన్నుతోంది. వేల మంది సర్వస్వం కోల్పోయి, శరణార్థ శిబిరాల్లో తలదాచుకుంటున్నారు. సిపిఎం ఢిల్లీ శాఖ వారికి అండగా నిలబడి సహాయ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. మన రాష్ట్రం సహా అన్ని రాష్ట్రాలనుంచి విరివిగా విరాళాలు సేకరించి, బాధిత ప్రజలకు సహాయం చేసేందుకు సిపియం ప్రయత్నం చేస్తోంది.

= = = =